సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 5 । మే । 2023



పిచ్చుకలను సంరక్షిద్దాం

అంతరించిపోతున్న పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి చేద్దామని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. II లో



మద్యం కల్తీకి చెక్..!

ఏయూ వేదికగా రీజనల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ లేబొరేటరీ ఏర్పాటుచేస్తున్నారు. మద్యంలో కల్తీ జరిగితే ఇక ఇట్టే పట్టేస్తారు. II లో



త్వరలో 'రివర్స్ గేర్'

విశాఖ నటీనటులతో త్వరలో రివర్స్ గేర్ అనే చిత్రాన్ని తన దర్శకత్వంలో తీయనున్నట్లు సినీ నటుడు ప్రసన్నకుమార్ తెలిపారు. II లో

న్యూస్‌రీల్

విశాఖ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ బదిలీ



రాహుల్

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.రాహుల్‌కు బదిలీ జరిగింది. ఆయనకు రాజమండ్రి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ జైళ్ల శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్ ఇక్కడ సుమారు ఐదేళ్లు సూపరింటెండెంట్‌గా పనిచేశారు. గతంలో ఆయన ఇక్కడ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కూడా పనిచేశారు. ఆయన బదిలీతో ప్రస్తుతం ఇక్కడ సూపరింటెండెంట్ పోస్టు ఖాళీ అవుతుంది. ఆ స్థానంలో అధికారులు ఎవరిని నియమిస్తారో వేచి చూడాల్సిందే.

బైక్, కార్ రెంటల్స్ ప్రారంభించిన డీఆర్‌ఎం



బైక్, కార్ రెంటల్స్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే ఇతర ప్రాంతాల ప్రయాణికుల కోసం రిజర్వేషన్ కౌంటర్ వద్ద శ్రీ రాధాకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ అండ్ కార్ రెంటల్స్‌ను వాల్తేర్ డివిజన్, డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో రోజురోజుకు పర్యాటకం అభివృద్ధి చెందుతున్నందున ఇటువంటి సేవలు ఎంతో అవసరమన్నారు. ప్రయాణికులకు సౌలభ్యంగా రైల్వే స్టేషన్ సమీపంలోనే ఏర్పాటుచేసిన కమర్షియల్ సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, ఇతర అధికారులు, సిబ్బంది, ఎస్‌ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ సిబ్బందితో సీపీ సమావేశం



మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీస్ సిబ్బందితో పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ గురువారం సమావేశమయ్యారు. పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో మహిళా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్న తీరును సమీక్షించారు. మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా సూచనలు చేశారు. సమావేశంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(ఎస్బీ) గంగాధరం, దిశ ఏసీపీ వివేకానంద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

డీఈవో చంద్రకళ



దేవాడ స్కూల్లో వివరాలు తెలుసుకుంటున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు రెండోదశ కింద చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. విశాఖ నగరంలో పనులు చేస్తున్న పలు పాఠశాలలను గురువారం ఆమె పరిశీలించారు. ఆయా పాఠశాలలకు మంజూరైన నిధులు, వాటితో ఇప్పటి వరకు చేపట్టిన పనుల వివరాలను ఉపాధ్యాయులు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు నూరు శాతం పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులుంటే, సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమన్వయంతో పనిచేసి, గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

హెచ్‌ఎంలు విధుల్లో ఉండాలి

పెదగంట్యాడ: గంగవరం, నడుపూరు, ఇస్లాంపేట క్లస్టర్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులను డీఈవో పరిశీలించారు. మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి పనుల పురోగతిపై తనకు సమాచారం ఇవ్వాలని ఎంఈవో పైడపునాయుడును ఆదేశించారు. హెచ్‌ఎంలు రోజూ విధుల్లో ఉండాలని ఆదేశించారు.

గంటా.. పరమశుంఠ!

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పరమశుంఠలా ప్రవర్తిస్తున్నాడు. ఎలక్షన్ కో పార్టీ మారే ఆయన.. గతంలో తాను మాట్లాడిన మాటలు మరచిపోయి ఇప్పుడు కొత్త కబుర్లు చెబుతున్నాడు. గెలిపించిన ప్రజలను ఇన్నాళ్లూ పక్కనపెట్టి.. ఇంట్లోనే కాలక్షేపం చేసిన ఆయనకు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఒక్కసారిగా ప్రజలు గుర్తుకొచ్చేశారు.

సెల్ఫీ చాలెంజ్‌లు, నిత్యం ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు.. అబ్బో అతని హడావుడి మామూలుగా లేదు.

- అర్థరహిత వ్యాఖ్యలతో పరువు పోగొట్టుకుంటున్న వైనం
- ఏయూ భవనాల 'సెల్ఫీ' గోల్
- స్కూల్ బస్సుల్లోనూ గంజాయి అంటూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యాఖ్యలు
- ఇప్పుడు గంజాయికి ఏపీ కేంద్రమంటూ విమర్శలు
- భోగాపురం విమానాశ్రయం విషయంలోనూ అదే ధోరణి
- 12 వేల ఎకరాలు అవసరం లేదన్న జగన్ వ్యాఖ్యలపై పిచ్చిప్రేలాపనలు
- అత్యుత్సాహంతో అభాసుపాలవుతున్న గంటా శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గెలిపించిన నియోజకవర్గ ప్రజల బాగోగులను గాలికొదిలేసి ఇన్నాళ్లూ ఇంటికే పరిమితమైన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బయటకు వచ్చి చేస్తున్న అర్థరహిత వ్యాఖ్యలతో నవ్వులపాలవుతున్నారు. చంద్రబాబు సెల్ఫీల స్ఫూర్తితో ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ విషయంలో చేసిన సెల్ఫీ ప్రయత్నం కాస్తా సెల్ఫ్‌గోల్‌గా మారింది. రోశయ్య సీఎంగా ఉన్న సమయంలో 2009లో శంకుస్థాపన ప్రాజెక్టును తమ ఖాతాలోకి వేసుకునే ప్రయత్నం చేసిన గంటా తీరు విమర్శలపాలైంది. విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన



వాయించు.. వాయించు..

అనుభవం ఉన్న వ్యక్తి ఇంత సిల్లీగా 'సెల్ఫీ' గోల్ కావడంతో గంటాను సోషల్ మీడియాలో పలువురు ఏకిపారేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి హోదాలో ఉండి స్కూల్ బస్సుల్లో గంజాయి తరలిపోతోందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు గంజాయికి ఏపీ కేంద్రంగా మారిపోయిందంటూ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వంపై చేసిన విమర్శల తీరును అందరూ ఎండగడుతున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా, భూసేకరణ చేయకుండానే చంద్రబాబు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ హయాంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రిగా అనుభవం ఉన్న గంటా.. అనుమతులు లేకుండా విమానాశ్రయ నిర్మాణం సాధ్యం కాదని తెలిసి కూడా.. చంద్రబాబు చేసిన తప్పును కప్పిపుచ్చుకుంటూ



2009లో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాటి సీఎం రోశయ్య(ఫైల్)



ఇదే భవనాన్ని టీడీపీ హయాంలో నిర్మించినట్టు సెల్ఫీ దిగి ఫోజులు ఇస్తున్న మాజీ మంత్రి గంటా

విమర్శలు గుప్పించడంపై మండిపడుతున్నారు.

భోగాపురంలోనూ అదే భజన

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి టీడీపీ హయాంలో ఏకంగా 12 వేల ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. అయితే విమానాశ్రయ నిర్మాణానికి అంత భూమి అవసరం లేదని.. 2,300 ఎకరాలు చాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే కేంద్ర పౌరవిమానయాన శాఖ అనుమతులు కానీ.. భూసేకరణ ప్రక్రియ చేపట్టకుండానే ఎన్నికల ముందు చంద్రబాబు హడావుడిగా శంకుస్థాపన చేశారు. పైగా భూసేకరణపై రైతులు కోర్టుల్లో కేసులు వేశారు. ఈ కేసులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. గతంలో మౌలిక సదుపాయాల శాఖ మంత్రిగా చేసిన గంటాకు ఈ విషయాలన్నీ తెలియవా? పార్టీ మారిన వెంటనే అన్ని విషయాలు మర్చిపోతారా? ఎప్పటికప్పుడు ఊసరవెల్లిలా రంగులు మార్చే ఆయన ఇప్పుడు స్వామి భక్తి చూపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

బాబు ప్రసన్నం కోసం ఆరాటం

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతుల కోసం ప్రయత్నించారు. మరోవైపు కోర్టుల్లో ఉన్న కేసుల విషయంలో రైతుల బాధను అర్థం చేసుకుంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ కేసులను కొలిక్కి తీసుకొచ్చారు. బిడ్డింగ్ ద్వారా నిర్మాణ సంస్థను ఎంపిక చేశారు. టీడీపీ హయాంలో విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఎంపిక కూడా జరగలేదు. చంద్రబాబు చేసిన శంకుస్థాపన కేవలం ఎన్నికల స్టంట్ అన్న విషయం అందరికీ సులువుగా అర్థమైంది. అయినా గంటా ఇప్పుడే నిద్ర నుంచి లేచి వచ్చి చంద్రబాబును మరీ వెనకేసుకురావడం విమర్శలపాలవుతోంది.

హడావుడితో మళ్లీ తెరపైకి..

2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ గంటా శ్రీనివాసరావు కిమ్మనకుండా ఇంటికే పరిమితమైపోయారు. కుక్కిన పేను మాదిరిగా ఏం మాట్లాడకుండా మౌనాన్ని ఆశ్రయించారు. ఆయన తీరు పట్ల నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సొంత పార్టీలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సులువుగా పార్టీలు మారే అలవాటు ఉన్న గంటా వంటి నేతలను ఓ కంట కనిపెట్టి ఉండాలని కూడా నేరుగా చంద్రబాబుకే మాజీ మంత్రి అయ్యన్న కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అయితే ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గంటా చేస్తున్న హడావుడి నవ్వులపాలవుతోంది.

సింహగిరిపై భారీ బందోబస్తు

వైశాఖ పౌర్ణమికి ఏర్పాట్లు



సింహగిరిపై ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పోలీసులు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వంద మంది పోలీసులతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైశాఖ పౌర్ణమికి సింహాచలేశుడి దర్శనానికి భారీ ఎత్తున భక్తులు తరలివస్తుండటంతో ఈ ఏడాది కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద, సింహగిరిపై పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహ మూర్తి ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్‌ఐలు, వంద మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రానికే పోలీసులు సింహాచలం చేరుకోగా, వారికి గోపాలపట్నం సీఐ నరసింహారావు డ్యూటీలు కేటాయించారు.

సాయంత్రానికే చేరుకున్న భక్తులు

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు భక్తులు గురువారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. వీరంతా శుక్రవారం ఉదయం వరాహ పుష్కరిణిలో స్నానమాచరించి సింహగిరికి తరలివెళ్తారు.

నేడు రెండో విడత చందనం సమర్పణ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం తెల్లవారుజామున రెండో విడత చందనం సమర్పణ జరగనుంది. ఇప్పటికే మూడు మణుగుల చందనంలో పలు సుగంధ ద్రవ్యాలను కలిపి సమర్పణకు సిద్ధం చేశారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ అనంతరం స్వామికి చందనం సమర్పిస్తారు.

పక్కి దివాకర్ మృతి పార్టీకి తీరని లోటు



పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ అకాల మరణం వైఎస్సార్ సీపీకి తీరని లోటని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మద్దిలపాలెంలో పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో గురువారం పక్కి దివాకర్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి అమర్‌నాథ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దివాకర్ అకాల మరణం కలచి వేసిందన్నారు. తాను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయనతో మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ఎన్నో సలహాలు, సూచనలందించారని గుర్తు చేసుకున్నారు. బీసీల ఐక్యత కోసం నిరంతరం తపించారని, ఆయన ఆశయ సాధన కోసం పనిచేస్తామన్నారు. పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీ నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెల 6న జరిగే దివాకర్ దశదిన ఖర్మకు అందరూ రావాలని కోరారు. పార్టీ అభివృద్ధి కోసం చాలా కష్టపడ్డారని, ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు అన్నారు. దివాకర్ అన్నయ్య వెంకట రవి మోహన్ మాట్లాడుతూ.. పక్క రాష్ట్రంలో నా సోదరుడు చనిపోతే పార్థివదేహాన్ని విశాఖకు తీసుకురావడానికి పార్టీ నాయకులు చాలా సాయం చేశారన్నారు. తన తమ్ముడికి సీఎం జగన్ అంటే అమితమైన ప్రేమన్నారు. మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, పి.వరలక్ష్మి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సీనియర్ నాయకులు రవిరెడ్డి, మంత్రి రాజశేఖర్, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోర్టు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని ఎన్నికల అధికారి బళ్ల శ్రీనివాసరావు తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఎల్.బి.అప్పన్న, ఉపాధ్యక్షులుగా ఎం.సత్యనారాయణ, జి.రవిసుందర్, డి.భాస్కర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా జి.శివరామకృష్ణతో పాటు వివిధ హోదాల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మన బడికి రండి!

- ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలపై ఫోకస్
- నేరుగా విద్యార్థుల ఇళ్లకే ఉపాధ్యాయులు
- వేసవి సెలవుల్లోనూ విధుల పట్ల అంకితభావం
- స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురు టీచర్లు



ఇంటి వద్దనే విద్యార్థికి ముందస్తు అడ్మిషన్ అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఇంటిబాట పట్టిన చింతల అగ్రహారం జెడ్పీ హైస్కూల్ సిబ్బంది

విశాఖ విద్య: వేసవి సెలవుల్లోనూ పనిచేయాలా..? అంటూ పెదవి విరుస్తున్న వారికి జిల్లాలోని పెందుర్తి మండలం చింతల అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దిక్సూచిగా నిలుస్తున్నారు. మన బడి-మన బాధ్యతను గుర్తు చేసుకుంటూ 2023-24 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై అప్పుడే ఫోకస్ పెట్టారు. హైస్కూల్ సమీప గ్రామాలకు వెళ్లి 'మన బడిలోనే విద్యార్థులను చేర్పించండి' అంటూ తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సౌకర్యాలు, విద్యార్థులకు అందే సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్నారు. కరపత్రాలు ముద్రించి గ్రామాల్లోని ఇంటింటికీ తిరిగి పంచుతున్నారు. జిల్లాలో వీరిలాంటి ఎంతో మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారు.

ప్రైవేటుకు దీటుగా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. అమ్మ ఒడి పథకం అమలుతో బడిబాట పట్టే వారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు వల వేస్తూ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేలా జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన మౌలిక వసతులు, జగనన్న విద్యా కానుక వంటి పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టి, అడ్మిషన్లు పెంచేలా దృష్టి సారించారు.

వారిపై ఫోకస్

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీ స్కూళ్లలో 13,664 మంది ఉన్నారు. వీరిలో ఆరేళ్ల వయసు నిండిన వారిని తప్పనిసరిగా ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించేలా ఫోకస్ పెట్టారు. అదే విధంగా ఐదో తరగతి నుంచి 36,966 మంది ఆరో తరగతిలోకి ప్రమోట్ అవుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇప్పటికే ఐదో తరగతి చదువుతున్న వారితో పాటు, ప్రైవేట్ స్కూళ్ల నుంచి వచ్చే వారెవరైనా ఉంటే.. వారికి ముందస్తుగా అడ్మిషన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసమని పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ విద్యా కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

నాణ్యమైన విద్య



ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య అందుతుంది. మా స్కూల్ పిల్లలు గత ఏడాది ఐఐఐటీకి ఎంపికయ్యారు. ఆరుగురుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పొందారు. ఒక విద్యార్థి జాతీయ స్థాయి యోగా పోటీల్లో సత్తా చాటాడు. తల్లిదండ్రులకు ఇవన్నీ చెప్పి.. మన బడిలోనే చేర్పించాలని కోరుతున్నాం.

-నాగమణి, హెచ్‌ఎం, చింతల అగ్రహారం

గ్రామాల్లో విస్తృత ప్రచారం



నాడు-నేడులో మా స్కూల్‌లో మౌలిక సౌకర్యాలు పెరిగాయి. అదనపు గదులు నిర్మాణం కూడా జరుగుతోంది. విద్యార్థులకు ప్రభుత్వ బడిలో ఉన్న సౌకర్యాలు, అందించే చదువులపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. దీనిపై ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాం.

– ఇమంది పైడిరాజు, హెచ్‌ఎం, అడవివరం హైస్కూల్

ఉపాధ్యాయులదే బాధ్యత



ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. అంగన్‌వాడీల నుంచి బయటకు వచ్చే వారు, అదే విధంగా హైస్కూళ్లలో చేరే వారి వివరాలను సేకరించి.. వారిని ముందుగానే సంప్రదించాలి. పాఠశాలల హెచ్‌ఎంలు దీనిపై పర్యవేక్షణ చేయాలి.

– గౌరీ శంకర్, డిప్యూటీ డీఈవో, విశాఖ

ఫిషింగ్ హార్బర్.. నిశ్శబ్దం



మహారాణిపేట: సముద్రంలో చేపల వేట నిలిచిపోవడంతో.. ఫిషింగ్ హార్బర్‌ను నిశ్శబ్దం ఆవహించింది. గత నెల 15వ తేదీ నుంచి 61 రోజుల పాటు సముద్రంలో వేట నిషేధం అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ఎక్కడ బోట్లు అక్కడే ఉండిపోయాయి. హార్బర్ పరిసర ప్రాంతాలు బోసిపోయాయి. బోట్లు, వలల మరమ్మతుల్లో మత్స్యకారులు నిమగ్నమయ్యారు.





హోయి హోయి.. జాబిల్లి..





వినీలాకాశంలో వెండి వెలుగుల చందమామ విలాసంగా నవ్వింది. లోకమంతా పాల రంగులో మెరిసింది. జలమా.. భూతలమా అన్న భేదం లేకుండా.. అడవీ ఎడారన్న అంతరం రాకుండా ఈ సోయగాల జాబిల్లి ఎంత మనోహరంగా మురిపించింది. ఇలాంటి వెన్నెల రాత్రి వెలుగులదారుల్లో తిరుగుతూ.. నేల రాలిన పారిజాతాలను ఎన్నయినా ఏరుకోబుద్ధవుతుంది. మంగమారిపేట శిలాతోరణం వద్ద గురువారం రాత్రి ఆవిష్కృతమైన ఈ దృశ్యం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంది. సముద్ర అలలపై ఇలా పున్నమి చంద్రుడు కాంతులీనుతూ కనువిందు చేశాడు. – కొమ్మాది

పిచ్చుకలను సంరక్షిద్దాం

దాబాగార్డెన్స్: అంతరించిపోతున్న పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి చేద్దామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఇంటి పరిసరాలకు వచ్చే పిచ్చుకలకు ఆహారపు గింజలు వేసి, వాటి సంరక్షణ మన బాధ్యతగా భావించాలన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ–జీవీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి చేద్దాం..పేరిట గురువారం ఏర్పాటు చేసిన నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. మట్టి పిచ్చుక గూడులు, మట్టి పాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరి వెంకటకుమారి మాట్లాడుతూ వేసవిలో పక్షులు, ఇతర జీవుల కోసం చిరుధాన్యాలు, మంచినీటి వసతి కల్పించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ స్వచ్ఛంద సంస్థ–జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రజల అవగాహనకు 400 మట్టి పిచ్చుక గూడులు, మట్టి పాత్రలను పంపిణీ చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఆ టీమ్ ప్రతినిధి జేవీ రత్నం బృందాన్ని మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్యనిర్వహణాధికారి స్వరాజ్యలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.పద్మజ, యూఎన్డీపీ కో ఆర్డినేటర్ ఎన్ఎస్ రాజమణి, రవికుమార్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో 'రివర్స్ గేర్'

- విశాఖకు చెందిన నటులతో చిత్రం
- సాక్షితో నటుడు ప్రసన్నకుమార్

సాక్షి ఇంటర్వ్యూ

కొమ్మాది : సినీ నటుడు ప్రసన్నకుమార్ అంటే ఒక్క క్షణం ఆలోచిస్తారేమోగానీ చంటి ప్రసన్న అంటే ఠక్కున గుర్తుపడతారు. విలక్షణ నటన, డైలాగ్ డెలివరీలో ప్రత్యేకత ఆయన సొంతం. గాజువాకకు చెందిన ప్రసన్నకుమార్ నటనపై ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్ వెళ్లిపోయారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 250కి పైగా చిత్రాల్లో నటించిన ఆయనకు సామాజిక అంశాలపై చిత్రాలు తీయడం అంటే ఆసక్తి. అలా లఘు చిత్రాలను తీసి తొమ్మిది నంది అవార్డులను సొంతం చేసుకున్నారు. విలన్‌గా, అన్నగా, తండ్రిగా ఏ పాత్ర అయినా అవలీలగా నటించే నటుడు ప్రసన్నకుమార్. చిన్నప్పటి నుంచి నాటకాలపై ఉన్న ఆసక్తితో సినిమా రంగంలో దర్శకుడిగా, నిర్మాతగా, నటుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఉక్కు సత్యాగ్రహం షూటింగ్ గ్యాప్‌లో ఆయనతో 'సాక్షి' ప్రత్యేకంగా మాట్లాడింది.

సాక్షి: ఇప్పటి వరకు ఎన్ని సినిమాల్లో నటించారు?

ప్రసన్న కుమార్: అభిలాషలో చిన్న పాత్రతో ప్రారంభమైన నా సినీ ప్రస్థానం ఇప్పటి వరకు 250కి పైగా సినిమాల్లో నటించాను. నటుడుగా మంచి గుర్తింపు తెచ్చిన సినిమా మాత్రం చంటి. ఆ చిత్రం నుంచే చంటి ప్రసన్నకుమార్‌గా స్థిరపడ్డా.



ఉక్కు సత్యాగ్రహం సినిమాలో పోలీస్ పాత్రలో ప్రసన్నకుమార్

సాక్షి: దర్శక నిర్మాతగా సినీ ప్రస్థానం ఎలా ఉంది?

ప్రసన్న : నటుడిగా విభిన్న చిత్రాల్లో అవకాశాలు లభిస్తున్నాయి. 'మరో ముందడుగు' సినిమాకు దర్శక, నిర్మాతగా వ్యవహరించాను. యూట్యూబ్‌లో మంచి ఆదరణ లభించింది.

సాక్షి: ప్రస్తుతం ఏ సినిమా నిర్మిస్తున్నారు?

ప్రసన్న : విశాఖకు చెందిన నటులతో త్వరలోనే రివర్స్ గేర్ అనే చిత్రాన్ని ప్రారంభిస్తున్నా. కథ సిద్ధమైంది. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తున్నా.. ప్రస్తుతం ఉక్కు సత్యాగ్రహం సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నాను.

సాక్షి: అలనాటి నటులందరితో నటించారా?

ప్రసన్న: కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు వంటి అగ్రకథానాయకులతో నటించాను. కానీ ఏఎన్ఆర్, ఎన్టీఆర్‌లతో ఒక్క సినిమా అయినా చేసి ఉంటే బాగుండేది. వారితో నటించలేకపోయా.

సాక్షి: ఇన్నేళ్ల సినీ ప్రస్థానంలో ఎన్ని అవార్డులు వచ్చాయి?

ప్రసన్న : మొత్తం 9 నంది అవార్డులు, గరుడ అవార్డు లభించాయి. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.

సాక్షి: మీ వారసులు సినీ రంగంవైపు వచ్చే అవకాశం ఉందా?

ప్రసన్న : లేదండి. మాకు ఒకే పాప. ప్రస్తుతం తను ఆస్ట్రేలియాలో వెల్ సెటిల్డ్.

సాక్షి: వైజాగ్‌కు సినీ పరిశ్రమ వస్తే ఎలా ఉంటుంది?

ప్రసన్న : వైజాగ్‌లో పుట్టడం నా అదృష్టం. సినిమా పరిశ్రమకు వైజాగ్ ఒక వరం. ఇక్కడెన్నో అపురూప దృశ్యాలున్నాయి. షూటింగ్ కావాల్సిన అన్ని హంగులు విశాఖకు సొంతం.

సాక్షి: ఈ జనరేషన్ నటులకు మీరిచ్చే సలహా..?

ప్రసన్న : ప్రతిభతో పాటు కష్టం, కృషి, పట్టుదల ఉంటే సినీ పరిశ్రమలో నిలదొక్కుకోగలరు. చిన్నదైనా, పెద్దదైనా వచ్చిన అవకాశాలన్నీ వదలకుండా ముందుకు సాగాలి. అప్పుడే నటులుగా నిలదొక్కుకోగలం.

అనుబంధ కమిటీలను నియమించండి

పార్టీ ఆయా విభాగాల జిల్లా అధ్యక్షులకు పంచకర్ల సూచన

మహారాణిపేట: పార్టీని బలోపేతం చేసే దిశగా అనుబంధ విభాగాల నిర్మాణం చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆయా విభాగాల అధ్యక్షులకు సూచించారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనుబంధ విభాగాల అధ్యక్షులు జిల్లా కమిటీని నియమించుకోవాలని, ఈ కమిటీలో అన్ని సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ప్రతీ నియోజకవర్గం నుంచి జిల్లా కమిటీలో ప్రాతినిధ్యం వహించే విధంగా చర్యలు చేపట్టి.. ఆ వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆడాల కృపా జ్యోతి(మహిళా విభాగం), బొండా ఉమా మహేష్ (ఐటీ విభాగం), నమ్మి లక్ష్మణ్‌రావు (విద్యార్థి విభాగం), మాన్యాల శ్రీనివాస్ (బీసీ విభాగం), బోని శివ రామకృష్ణ (ఎస్సీ విభాగం), పెంద్ర అప్పన్న (ఎస్టీ విభాగం), కె.వి.బాబా (మైనార్టీ విభాగం), కలిదండి బద్రినాథ్(వైఎస్సార్ ట్రేడ్ యూనియన్), వానపల్లి ఈశ్వరరావు(వాణిజ్య విభాగం), వంకాయల మారుతీప్రసాద్ (వైఎస్సార్ సేవాదళ్), బయ్యవరపు రాధ (సాంస్కృతిక విభాగం), ఎ. రవిబాబు (క్రిస్టియన్ మైనార్టీ విభాగం), డా. వాక చంద్ర శేఖర్‌రెడ్డి (వైద్య విభాగం) తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

ఇద్దరికి కరోనా

మహారాణిపేట: జిల్లాలో గురువారం రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 123 మందికి పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 25కి చేరింది. 23 మంది హోం ఐసోలేషన్‌లో, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

చిట్‌ఫండ్స్ కంపెనీలను ఆ ఇద్దరే నడుపుతున్నారా?

మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు

మహారాణిపేట: రాష్ట్రంలో రామోజీరావు, ఆదిరెడ్డిలే చిట్ ఫండ్స్ కంపెనీలు నడుపుతున్నారా? మిగతా వారు నడుపుతున్న చిట్ కంపెనీలు మీకు కనిపించడం లేదా అని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలుగుదేశం జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్య అన్నారు. సిట్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చిందని వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు చేసుకుంటున్నారని, చంద్రబాబు ఏ తప్పూ చేయలేదన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, అదానీ డేటా సెంటర్లకు మళ్లీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ హెలికాప్టర్‌లో వెళ్లిన సీఎం కోసం 100 కిలోమీటర్ల రోడ్డు బ్లాక్ చేశారన్నారు. సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి నజీర్, ఉత్తర ఇన్‌చార్జి చిక్కాల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఏ మంజూరుపై వైఎస్సార్ టీఎఫ్ హర్షం

విశాఖ విద్య: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు డీఏ విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గురువారం నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏ మంజూరు ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ఎంతో సానుకూలతతో ముందుకెళ్తున్నారన్నారు. సర్వీసు, ఆర్థికపరమైన ఇతర సమస్యలు అన్నీ త్వరలోనే పరిష్కారమౌతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్యం కల్తీకి చెక్.!



ఏయూలో నిర్మాణంలో ఉన్న ప్రయోగశాల

- ఏయూలో సిద్ధమవుతున్న రీజినల్ లేబొరేటరీ
- డిస్టిలరీ నుంచి వినియోగదారుడి చేరేవరకు పారదర్శకత
- రూ.3 కోట్ల వ్యయంతో అధునాతన ప్రయోగశాల

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): మద్యంలో కల్తీ జరిగితే ఇట్టే పట్టేస్తారు. మద్యం తయారు చేసే డిస్టిలరీలలో ఉపయోగించే పదార్థాల నుంచి వినియోగదారుడికి చేరే వరకు మద్యం ప్రమాణాలు కాపాడే విధంగా నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. రెండు వేర్వేరు బ్రాండ్‌ల మద్యం కలిపి విక్రయించే వారికి అడ్డుకట్ట పడనుంది. అదే విధంగా ఇతర మత్తుపదార్థాలకు సంబంధించిన శాస్త్రీయ అధ్యయనం చేసే సదుపాయాలు సమకూరుతున్నాయి. కొద్దిరోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు ఉపయుక్తంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా రీజినల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ లేబొరేటరీ అందుబాటులోకి రానుంది.

అనుక్షణం పర్యవేక్షణ

గతంలో మద్యంలో నీరు కలిపారా అనేది మాత్రమే తెలుసుకునే సాంకేతికత, ఉపకరణాలు అందుబాటులో ఉండేవి. నేడు ఏర్పాటు అవుతున్న అత్యాధునిక ప్రయోగశాలలో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ సహాయంతో విభిన్న అంశాలను అధ్యయనం చేసే అవకాశం ఉంది. ముందుగా మద్యం తయారు చేసే డిస్టిలరీలలో ఉపయోగించే ఆల్కహాల్‌తో పాటు ఇతర పదార్థాల నాణ్యత, వాటిలో ఉండే ఇతర ఇంప్యూరిటీస్‌ను గుర్తించే అవకాశం ఉంది. దీని ఫలితంగా తయారీలో నాణ్యత, ప్రమాణాలు కచ్చితంగా పాటించే విధంగా చూడడం అధికారులకు సులభమవుతుంది.

మద్యం తయారీలో ఒక్కో బ్రాండ్‌కు ఒక ప్రత్యేకమైన ఫార్ములా ఉంటుంది. బార్, రెస్టారెంట్‌లలో మద్యం విక్రయించే సమయంలో నీరు కలుపుతున్నారా, ఎంతశాతం కలిపారనేది సులభంగా నూతనంగా ఏర్పాటు చేసే ప్రయోగశాలలో గుర్తించే అవకాశం ఉంది. దీంతోపాటు రెండు వేర్వేరు బ్రాండ్ మద్యం కలిపి విక్రయిస్తే సులభంగా ప్రయోగశాలలో గుర్తించడం వీలవుతుంది. దీనితో విక్రయాలలో కల్తీని నివారించడం సాధ్యపడుతుంది.

నూతన ప్రయోగశాల

ఆంధ్రవిశ్వవిద్యాలయం స్టాటస్టిక్స్ విభాగం వెనుక భాగంలో దాదాపు రూ.3కోట్ల వ్యయంతో నూతన ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో ప్రత్యేకంగా ప్రయోగశాల, కార్యాలయం, గ్యాస్ చాంబర్, సెక్యూరిటీ గది నిరంతరం 25 కేవీ విద్యుత్ సరఫరా, పూర్తిగా ఎయిర్ కండీషనరింగ్ కలిగిన ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పనులు తుది దశకు చేరుకున్నాయి. గ్యాస్ కొమెటోగ్రఫీ (జీసీహెచ్ఎస్), హై పెర్మార్మెన్స్ లిక్విడ్ క్రొమెటోగ్రఫీ (హెచ్‌పీఎల్‌సీ), డైజస్టర్ (ఎండీఎస్), అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రోస్కోపి (ఏఏఎస్) వంటి పరికరాలు ప్రయోగశాలలో వినియోగిస్తారు. ఇప్పటికే ఈ పరికరాలు విశాఖకు చేరుకున్నాయి. కొద్దిరోజుల్లో ప్రయోగశాల సిద్ధమై సేవలు అందించడానికి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా త్వరితగతిన పనులు జరుగుతున్నాయి.

పారదర్శకత పెరుగుతుంది

మద్యం తయారీ నుంచి, విక్రయం వరకు ప్రతీ దశలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం ఏర్పాటు అవుతున్న రీజినల్ లేబొరేటరీ మూడు జిల్లాలకు సేవలు అందిస్తుంది. మద్యంలో కల్తీతో పాటు, ఇతర మత్తుపదార్థాలకు సంబంధించిన శాస్త్రీయ పరీక్షలు సైతం ఇక్కడ జరిపే అవకాశం ఉంది. నార్కోటిక్ డ్రగ్స్‌ను చాక్లెట్లు ఇతర రూపాలలో విక్రయిస్తారు. వీటిని శాస్త్రీయంగా పరీక్షించి, వాటిలో వినియోగించిన డ్రగ్, పరిమాణం వంటివి గుర్తిస్తాం. నేరం జరిగే అవకాశం, జరిగిన సందర్భంలో శాస్త్రీయంగా అధ్యయనం జరపడానికి వీలుగా ఈ ప్రయోగశాల నిలుస్తుంది.

– బెండపూడి శ్రీనివాసులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్